# దీపము ఉండగానే......

నాకు నిద్రపట్టలేదు బెర్తుమీద అటూ, యిటూ దొర్లాను. బండి కదలికను బట్టి, పరుగెత్తేటప్పుడు వచ్చిన శబ్దాన్ని బట్టి ట్రైన్ చాలావేగంగా వెళుతోందనే సంగతి నెలకు ఇరువది రోజులు ట్రైన్‌లోనే గడిపే నాకు అర్థమయింది, కానీ...

నాకు రెక్కలువుంటే బాగుండేది అని తోచింది. రెక్కలుగాని ఉండివుంటే హైదరాబాదులో మా బాస్ ముందువాలి నన్ను హఠాత్తుగా ఎందుకు రమ్మన్నారనేది, ఈ పాటికే తెలుసుకొనివుండేవాడిని.

ఎందుకు రమ్మన్నట్లు.....

అతివేగముగా ప్రయాణము చేసే బండి చక్రములు రైలుపట్టాలని రాసుకుంటున్నప్పుడు ఆవిర్భవించిన అగ్ని విస్ఫులింగాలు చుట్టూవున్న చీకటిని చేదించలేకపోతున్నట్లే, నా ఆలోచనా విస్ఫులింగాలు. మాబాస్ ఉద్దేశాల పొరలను చేధించలేకపోతున్నాయి.

సాధారణముగా మాలాంటి సేల్స్ ఇంజనీర్లకు ఆఫీసుకు రమ్మని పిలుపురాదు. నిర్ణీతమయిన అమ్మకాల లక్ష్యాన్ని సాధిస్తూ వుంటే సంవత్సరాలతరబడి ఆఫీసు ముఖము చూడకుండా గడప వచ్చును రాబోయే సంవత్సరము సాధించవలసిన అమ్మకాల గురించి వివరించుటకు, గడచిన ఏడాది సాధించలేకపోయిన అమ్మకాల గురించి గుర్తుచేసి చీవాట్లు పెట్టి రాబోయే సంవత్సరము జాగ్రత్తగా మెలగవలెనని, హెచ్చరించుటకు ఉపయోగపడే సమావేశాలు కూడా హెటళ్ళలోనే జరుపుతూ వుంటారు మరి నన్ను పిలవటములోని ఉద్దేశము....

నిర్ణీతమయిన అమ్మకాలు సాధించలేకపోయానా..... సంవత్సరకాలములో సాధించాల్సిన అమ్మకాలు ఆరునెలల్లోనే సాధించాను కదా!

సరిగ్గా ఆరు నెలలక్రితమే ఈ ప్రాంతానికి వచ్చాను. అప్పుడు ఈప్రాంతములో

మా అమ్మకాలు అంతంత మాత్రమే! ఏడాదిపైనే పని చేసినా అమ్మకాలు పెంచలేక పోయినందువల్ల అక్కడి ఇంజనీర్‌ని ఉద్యోగము నుంచి తొలగించారట! ఆ సంగతి బదిలీ అవ్వకముందే నాకు తెలుసు. అంతేకాదు, అమ్మకాలు సేల్స్ ఇంజనీర్ల ఉద్యోగానికి ప్రాణవాయువు అని కూడా తెలుసు. అందుకే వచ్చిన మొదటిరోజు నుండి అడుగు నేలమీద పెట్టకుండా తిరిగాను. నన్ను బదిలీ చేస్తూ మా బాస్ అన్న మాటలు నా చెవుల్లో గింగిర్లెత్తుతూనే వున్నాయి.

"చూడు సుబ్బారావ్. నువ్వు నాకు నచ్చావయ్యా" ముందు వరుసలో ఉన్న రెండు బంగారు పళ్లూ కనబడేలా నవ్వుతూ అన్నారు మా బాస్" నీ పట్టుదలా, లక్ష్యాన్ని సాధించాలనే నీ తపన నువ్వు చేరిన రోజు నుంచీ గమనిస్తూనే వున్నాను. అందుకే.... అతను బల్లమీద నిత్యాగ్నిహోత్రములా వెలిగే పైపు అందుకున్నారు. అతనికి పనికిరాకుండా మారిన బూడిదని అగ్గిపుల్లతో పక్కకి జరిపి పైపు నోట్లో పెట్టుకున్నారు. రెండుసార్లు గట్టిగా పొగ పీల్చి అన్నారు. "అందుకే నిన్ను బదిలీ చేస్తున్నావయ్యా!"

ఆశనిపాతంలా తగిలాయి ఆ మాటలు. ఉద్యోగములో చేరి మూడు నెలలైనా కాలేదు ఉద్యోగానికి పని చేసే ప్రాంతానికి యింకా పూర్తిగా అలవాటు పడలేదు. అంతలోనే బదిలీయా!

బాస్‌వైపు చూసాను. అతని మనస్సే కాదు, అతని మోము కూడా కనబడలేదు నాకు. అతను పీల్చి వదిలిన పొగ మా యిద్దరి మధ్యన తెరలా నిలబడింది.

"బదిలీయా! ఎక్కడకు?" నా గొంతు వణికింది. అతను ఆ వూరి పేరు చెప్పారు. నా కళ్ళు తిరిగిపోయాయి గత మూడేళ్ళుగా ఆ వూరిలో అమ్మకాలు పెంచటానికి చేస్తున్న ప్రయత్నాలు పూర్తిగా విఫలమైపోయాయని నాకు తెలుసు. అక్కడికి నన్ను బదిలీ చేయటములోని ఉద్దేశము.....

బరువుగా కదిలిపోయాయి నిముషాలు. నా మొహములోని కంగారు గమనించినట్లున్నారు మాబాస్.

"అలా కంగారు పడుతున్నావేమిటయ్యా?" పైపులో నుండి బూడిదగా మారిన పొగాకు బదులు, కొత్త పొగాకు నింపుతూ అన్నారు అతను. "ఇలాంటివి సవాల్‌గా తీసుకోవాలి. భయపడకూడదు. భయపడితే పైకి రాలేవు. నీలాగే భయపడితే నేనిలాగే వుండేవాడినా?"

నిజమే! మా బాస్ కూడా నాలుగు సంవత్సరాల క్రితము నాలాగే సేల్స్ ఇంజనీర్‌గానే చేరారట! సమస్యలు పరిష్కారములోనూ, అమ్మకాలు పెంచటములోనూ సిద్ధహస్తుడు కనక వెంటవెంటనే ప్రమోషన్‌లు అందుకొని బాస్ అయ్యారట!

"రేపే నువ్వు అక్కడ చేరిపోతున్నావ్..." మా బాస్ యింకా ఏమేమో అన్నారు. ఆఫీసు వెనుకవున్న విమానాశ్రయములో నేలమీద నుంచి ఆకాశాని కెగిరిన విమాన ఘోషలో నాకేమీ వినపడలేదు.

మరోవేపు తిరిగి పడుకున్నాను. మెల్లిగా కళ్ళు తెరిచాను.

ఎదురుగా వున్న పై బెర్తులో కాలు ముడుచుకొని పడుకొని వున్నాడు ఓ నలుబది ఏళ్ళ మనిషి. ట్రైన్ కదలికకు అతని కాళ్ళవద్దవుంచిన పళ్ళబుట్టలు ఊగి అతని పాదాలని తాకుతున్నాయి.

పరిశీలనగా చూసాను. అతను మా సేల్స్ కులానికి చెందినవాడేనని అర్థమయింది నాకు.

ట్రైన్ బయలుదేరుతూ వుండగా పరుగెత్తి, పరుగెత్తి వచ్చాడు అతను. అతనికన్నా ముందు పాతికేళ్ళ యువకుడు బుట్టలుపై బెర్తులో సర్ది ఓ టిక్కెట్టు అతని చేతిలో పెట్టి అన్నాడు. "మీకు ఏమీ యిబ్బంది వుండదు సార్, పై బెర్తు ఎక్కి పడుకోండి. టి.టి.ఇ.తో చెప్పాను యివ్వాల్సినదంతా యిచ్చేసాను కూడా" అతని మోముమీద హావ భావాలని నిరీక్షిస్తూ అన్నాడు ఆ యువకుడు.

"బుట్టలు బెర్తుమీద సర్దేశాను సార్. అన్నీ నూజివీడు రసాలే" అతని కళ్ళలో చిన్న మెరుపు మెరిసింది. ప్రమిదలో వెలిగించిన ఒంటి ఒత్తి దీపంలా వెలిగేయి,

చుట్టూ నల్లచారలు బారిన అతని కళ్ళు.

అతను ఆ యువకునితో ఏవేవో అన్నాడు. శ్రద్ధగా వింటూ అలాగే, అంటూ చేతులు కట్టుకొని నిలబడ్డాడు ఆ యువకుడు నోరు మెదపలేదు. బాస్‌చెప్పిన ప్రతీమాటతోనూ ఏకీభవించటము ఉద్యోగ పురోభివృద్ధికి పునాది అని తెలుసుకున్నాడు కాబోలు అతను.

కొండ ఎక్కి తలనీలాలు అర్పించుకుంటే దేవుడు యిచ్చిన వరాలు కనబడటానికి ఆలస్యమైనా అవుతాయి కానీ, పంచామృత అభిషేకాలు, నైవేద్యాలు అర్పిస్తే బాస్ యిచ్చే వరాలు మాత్రం వెంటనే కనబడతాయి కదా!

నా గుండెల్లో రాయిపడింది మొన్ననే వచ్చి వెళ్ళారు మా బాస్. అతనికి చేయవలసిన మర్యాదలలో ఏమన్నా లోపం జరిగిందా?

అతను హైదరాబాద్ చేరగానే వచ్చిందీ పిలుపు. నాకు పిచ్చి ఎక్కినట్లు అయింది. అటూయిటూ దొర్లాను. నిండా దుప్పటి కప్పుకొని, కళ్ళు గట్టిగా మూసుకొని పడుకున్నాను. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియలేదు. మెలకువ వచ్చేసరికి ట్రైన్ హైదరాబాద్ చేరిపోయింది. గబాగబా దిగిపోయాను.

ప్రసన్నంగానే కనబడ్డాడు మా బాస్. "రావోయ్! నీగురించే చూస్తున్నాను" నవ్వుతూ ఆహ్వానించేరు అతను "కూర్చో"

కీడు శంకిచిన నా మనస్సు కొంత కుదుటపడింది. "నానమ్మకాన్ని నిలబెట్టావయ్యా ఆరు నెలలలో యింత అమ్మకాలు సాధించావంటే...." అతను పైపులో పొగాకు నింపుతూ అన్నారు. "ఎవరూ చెయ్యని, చెయ్యలేని నీ పనితనాన్నీ మెచ్చుకుంటున్నాను. అభినందిస్తున్నాను కూడ అందుకే..." పొగ గట్టిగా పీల్చి అన్నారు మాబాస్. "అందుకే నిన్ను మళ్ళీ బదిలీ చేస్తున్నానయ్యా"

ఖంగుతిన్నాను, నేను. బాగా పని చేస్తే ప్రమోషన్ గానీ యింక్రిమెంటుగానీ యిస్తారని అనుకున్నాను గానీ బదిలీ చెయ్యటమేమిటి?

"నీవు ఈ రోజే బయలుదేరాలి.... ఆ ప్రాంతములో అస్సలు అమ్మకాలు లేవు అనే చెప్పాలి"

నాకు పట్టరాని కోపము వచ్చింది. "అమ్మకాలు పెంచితే, బాగా పనిచేస్తే ప్రమోషన్ యిస్తారని...." నా మాటలు కోపముతో తడబడ్డాయి.

"అప్పుడే తొందరపడితే ఎలాగ? మరోసారి చూపించు నీ తడాకా"

"అంటే ఈ ప్రాంతములో కూడా అమ్మకాలు పెంచితే ప్రమోషన్ యిస్తారా సార్?"

"ఇస్తానని నేను చెప్పలేను" అతను సాలోచనగా అన్నాడు. "కానీ నీకు ప్రమోషన్‌కి అర్హత వస్తుంది"

"మీ ఉద్దేశము" అతని మాటలు నాకు అర్ధము కాలేదు. "దేనికయినా అర్హత రావాలి కదయ్యా. అర్హత వేరు ప్రమోషను రావడం వేరు" బల్లమీద ఉన్న భూగోళాన్ని అలవోకగా తిప్పుతూ అన్నారు బాస్. "...............................అర్హత ఉంటే ఎక్కడైనా రావచ్చు. చూడు, నువ్వు మంచి ఉత్సాహముతో పని చేస్తున్నావు నీ శక్తి సామర్థ్యాలన్ని సంస్థకి ఉపయోగకరంగా చేయటము నా డ్యూటీ"

అతని ఉద్దేశము నాకు అర్ధమయింది బరువుగా గేటువేపు నడిచాను.

గేటు దగ్గరగా వున్న వర్క్‌షాపులో ఎర్రని ఉదయసూర్యుని లాంటి లోహగోళాన్నీ సుత్తితో కొట్టి సాగతీస్తున్న కార్మికులు నన్ను చూసి ఎగతాళిగా నవ్వుతున్నట్లు తోచింది నాకు.

రాఘవీస్ కోకిల, నవంబర్, 2000